సాక్షి
మంచిర్యాల
బుధవారం । 25 । డిసెంబర్ । 2024



# అధికారులకు అసైన్డ్ ఉచ్చు!

- సర్వే నంబర్ '324'లో క్రయ విక్రయాలపై నివేదిక
- ఓ సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌కు చిక్కులు
- గత రికార్డులు స్పష్టంగా లేక ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు


సర్వే నంబరు 324లో భూవిస్తీర్ణం వివరాలు


శ్రీనివాస కాలనీలో ఉన్న వాగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'అసైన్డ్' భూమిలో జరిగిన లావాదేవీలపై రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్లకు ఉచ్చు బిగుసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఏసీసీ, ప్రస్తుత శ్రీనివాస కాలనీలో సర్వే నంబర్ 324లో వివాదంపై విచారణ జరుగుతన్న విషయం తెలిసిందే. ఇక్కడ ఓ మాజీ సైనికుడికి కేటాయించిన భూమిలో వారసుల మధ్య వివాదంలో అప్పటి రెవెన్యూ, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్లకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఈ వివాదంపై విచారణ నేపథ్యంలో ఈ సర్వే నంబరులో గతేడాదిగా జరిగిన లావాదేవీల వివరాలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మొదట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు స్పందించలేదు. దీంతో మంచిర్యాల మండల రెవెన్యూ అధికారులు గట్టిగా అడగడంతో చివరకు ఆ రిజిస్ట్రేషన్లు చేసిన అధికారుల పేర్లు వెల్లడించారు. ఆ వివరాలు తాజాగా కలెక్టర్‌కు నివేదించారు. బాధ్యులైన ఓ సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలకు కలెక్టర్ సిఫారసు చేసే అవకాశం ఉంది. తండ్రి నుంచి సంక్రమించిన అసైన్డ్ భూమిని ఇద్దరు అన్నదమ్ములకు వాటాలను ఒకరి వారసత్వం, మరొకరికి సాదాబైనామాలో అమ్మినట్లు కాగితాలు చూపి అధికారులు రికార్డుల కు ఎక్కించారు. ఈ అసైన్డ్ భూమిలో క్రయ విక్రయాలతోపాటు, తప్పుదోవపట్టించిన అప్పటి వీఆర్వోలు, క్షుణ్ణంగా పరిశీలించకుండా ధ్రువీకరించిన నాటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**స్పష్టత లేక సమస్య**

జిల్లా కేంద్రలోని శ్రీనివాస కాలనీ, ఏసీసీ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి 324 సర్వే నంబరు పాత రికార్డులు గందర గోళంగా ఉన్నాయి. దీంతో ఏళ్లుగా ఈ రికార్డులపై స్పష్టత లేకపోవడంతో ఇంకా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం ధరణి, పాత రికార్డుల ప్రకారం వేర్వేరుగా ఉండడంతో అస్పష్టత కొనసాగుతోంది. విజిలెన్స్ విచారణతోపాటు ఉన్నతాధికారుల సమక్షంలోనూ సర్వేలు జరిగాయి. తాజాగా ఇద్దరు వారసుల మధ్య వివాదంతోనూ అటు సబ్ రిజిస్ట్రార్, ఇటు రెవెన్యూ అధికారుల తప్పిదాలు బయటపడ్డాయి.

**వాగు పరిధి 12.04 ఎకరాలు**

సర్వే నంబరు 324 మొత్తం 117 ఎకరాలు విస్తీర్ణం ఉంది. ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఎక్కించారు. ఫిర్యాదుల తర్వాత విచారణ సందర్భంగా పాత రికార్డులను పరిశీలించారు. ఇందులో 60 ఎకరాలు జంగ్‌సిపాయికి చెందిన భూమి, 10.25 ఎకరాలు ఏసీసీ భూ సేకరణలో తీసుకుంది. మిగతాది మరో తొమ్మిది మందికి అసైన్డ్ చేసింది. ఇందులో వాగు పరిధిలోనే 12.04 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులే ధ్రువీకరించారు. అసైన్డ్ భూమి పోను మిగతా 22.29 ఎకరాల్లో ఎక్కడా ఖాళీ లేకుండా రికార్డుల్లో ఉంది. ఈ విస్తీర్ణంపై స్పష్టత లేకపోవడంతోనే ఇప్పటికీ అదే గందరగోళం కొనసాగుతోంది.



చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాక

## యేసు ఆగమనమే క్రిస్మస్

లోక రక్షకుడు అయిన యేసు క్రీస్తు జననం.. క్రైస్తవులకు పండుగ దినం. ప్రపంచానికి వెలుగులు పంచిన దినం. దీనులు, పేదలు, నిరాశ్రయులకు అండగా నిలవాలన్న సందేశమే క్రీస్తు జననం. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్. డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని అన్ని చర్చీల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశం వినిపించారు.


మేరీ, శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు

## డిజిటల్, వర్చువల్ విధానంతో సమగ్ర న్యాయం

- అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సమగ్ర న్యాయం జరుగుతుందని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. వినియోగదారుల డిజిటల్ విధానం వర్చువల్ విచారణ ద్వారా సమగ్ర న్యాయం పొందవచ్చని, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సాంకేతిక అవశ్యకత, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన, సంబంధిత అంశాలకు మరింత అందుబాటులో ఉండేలా చేపట్టాల్సిన చర్యలు వివరించారు. వినియోగదారుల కోసం మున్సిపల్ విచారణలు, ఆన్‌లైన్ ఫిర్యాదుదాఖలు, డిజిటల్ వనరుల ప్రయోజనాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు సమగ్ర న్యాయం జరిగేలా డిజిటల్ యాక్సెస్‌ను నిర్ధారించడంలో ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందన్నారు.

### ధాన్యం సేకరణ
## వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని, ఈ నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాల, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, సహకారశాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రైతుబీమా పథకంలో అర్హులైన లబ్ధిదారుల కుటుంబాలకు అందించాల్సిన పరిహారం చెల్లింపులో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నామినీ కూడా మృతి చెందితే నిబంధన ప్రకారం సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

**రబీ సాగుకు విత్తనాలు, ఎరువులు..**

రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో సాగుకు అవసరమైన డీఏపీ, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. చెన్నూర్, జైపూర్ మండలాల పరిధిలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలన్నారు. పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈవోలు తమ ఫొటో, లైవ్ లోకేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మ్యాట్రిక్ ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధి ఉదయ్‌కుమార్, డీఏవో కల్పన, ఉద్యానవన అధికారి అనిత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

**వార్షిక రుణ లక్ష్యాలు సాధించాలి**

మంచిర్యాలఅగ్రికల్చర్: వార్షిక రుణ లక్ష్యాలను సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం డెబోజిత్ బొరా, యూనియన్ ఆఫ్ ఇండియా ఏజీఎం సురేశ్, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రవూఫ్‌తో కలిసి రుణ లక్ష్యసాధనపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ వరకు పంట రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇచ్చిన రుణాలు, విద్యా రుణాలు, మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలపై చర్చించారు. టీజీబీ రీజినల్ మేనేజర్ మురళీధర్‌రావు, ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ ప్రభుదార్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలి**

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని, దరఖాస్తుదారుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా యాప్‌లో నమోదు చేయాలనికలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వరావులతో కలిసి ఎంపీడీవోలతో సమీక్ష ఇర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, జలశక్తి అభియాన్, ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులు, కోతులు, కుక్కల నివారణపై చరిచంచారు. ఇందిరమ్మ సర్వేలో సాంకేతిక సమస్యలు ఉంటే రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయలన్నారు. ఉపాధి పనులు గడువులోపు పూర్తి చేయాలన్నారు.

## సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేయాలి


ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పెద్దపల్లి పార్లమెంట్ ని యోజకవర్గ పరిధిలో సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేయాలని టెక్నికల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. మంచిర్యాలలోని ఎంపీ ఇంటికి వెళ్లిన ప్రతినిధులు మంచిర్యాలలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, ధర్మపురి నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి మైనింగ్ కోర్సు ప్రవేశ పెట్టాలని కోరారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి 2025–26 విద్యా సంవత్సరానికి నూతన కోర్సులు, నూతన కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నే పథ్యంలో తమ వినతిని సాంకేతిక విద్యామండలి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో టెక్నికల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు పూదరి శ్రీకాంత్‌పటేల్, నా యకులు మేకల మల్లికార్జున్, సామ మనోజ్‌కుమార్ ఉన్నారు.

# రక్షణోదయం.. క్రీస్తు జననం



యేసు అంటే రక్షణ.. యేసు జననమే రక్షణోదయం. అదే క్రిస్మస్. రక్షణకు పుట్టినరోజు. ఆ రక్షణ కార్యానికి పుట్టిన క్రీస్తును ఆరాధించడమే క్రిస్మస్. బుధవారం (డిసెంబర్ 25) క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరుపుకోనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని చర్చీలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. క్రిస్మస్ సందర్భంగా పురాతన చర్చీలపై ప్రత్యేక కథనం.

## బెల్లంపల్లి చర్చికి 70 ఏళ్లు



బెల్లంపల్లిలోని సీఎస్ఐ చర్చి

**బెల్లంపల్లి:** 1927లో బొగ్గు గనుల తవ్వకాలు ప్రారంభమయ్యాయి. 1954 ఫిబ్రవరి 21న ఇంగ్లాండ్‌కు చెందిన రెవ డాక్టర్ డబ్ల్యూతీ సంగస్టర్ చర్చి నిర్మాణానికి భూమిపూజ చేయగా 1958లో రెవ.నోయల్ బ్రూయిస్ మిషనరీగా వచ్చి ప్రారంభోత్సవం చేశారు. క్రైస్తవుల వివాహ వేడుకలకు సీఎస్ఐ చర్చి ఎంతగానో ప్రసిద్ధిగాంచింది. ఇందులో వివాహం చేసుకున్న దంపతులు ఆయురారోగ్యాలతో సంసార జీవనం సాగిస్తారనే విశ్వాసం సమాజంలో ఉంది.

## మిషన్ చర్చికి 51 ఏళ్ల చరిత్ర



ముస్తాబైన క్రిస్టియన్ మిషన్ చర్చి

**చెన్నూర్:** పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో ఐఈఎం, క్రిస్టియన్ మిషన్ చర్చిని 1974లో పాస్టర్లు డానియాల్, ఆనందరావు, తంబిరాజు ఆధ్వర్యంలో నిర్మించగా నేటికి 51 ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రతీ ఆదివారం చర్చిలో వందలాది మంది ప్రార్థనలు చేస్తారు. క్రిస్మస్‌కు రెండు రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయని పాస్టర్ సత్యరాజ్ తెలిపారు.

## క్రీస్తురాజు దేవాలయం



ముస్తాబైన క్రీస్తురాజు దేవాలయం

**ఇచ్చోడ:** మండల కేంద్రంలోని క్రీస్తురాజు దేవాలయం క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. అతిపురాతన చర్చీల్లో క్రీస్తురాజు దేవాలయం ఒకటి. ఈ చర్చిని 1968లో నిర్మించారు.

## చరిత్రకు సజీవ సాక్ష్యం 'సీఎస్ఐ'

- రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చి
- 89 వసంతాలు పూర్తి

**లక్సెట్టిపేట(మంచిర్యాల):** తెలంగాణలో మెదక్ తర్వాత రెండో అతిపెద్ద చర్చిగా లక్సెట్టిపేటలోని సీఎస్ఐ చర్చికి గుర్తింపు ఉంది. చారిత్రక కట్టడాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. చర్చి నిర్మించి 89 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఏటా క్రిస్మస్‌కు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేస్తారు.

**చర్చి వివరాలు**

లక్సెట్టిపేటకు రెండు కిలోమీటర్ల దూరంలో సీఎస్ఐ ప్రదేశంలో వందకు పైగా ఎకరాల్లో మిషన్ కాంపౌండ్ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించారు. 1920లో ఇంగ్లాండ్‌కు చెందిన రెవ ఈడబ్ల్యూలాంట్ లక్సెట్టిపేటకు వచ్చి మిషనరీ సంస్థలో పదేళ్లపాటు మిషనరీగా పనిచేశాడు. అతను ఏసుక్రీస్తును ఆరాధించేవాడు. ఇక్కడ చర్చి నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. ఇంగ్లాండ్ నుంచి ప్లాన్ తెప్పించాడు. 95 ఫీట్ల వైశాల్యం, 45 ఫీట్ల వెడల్పు, ప్రాంగణ వైశాల్యం 70 ఫీట్లు, సుమారు 500 మందికి వసతి



విద్యుత్ కాంతుల్లో మిషన్ కాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చి

కల్పించేలా 1930లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇంగ్లాండ్ నుంచి రంగుల అద్దాలు, గూడెం గుట్ట, గువ్వల గుట్ట, చిన్నయ్య గుట్టల నుంచి రాళ్లు తెప్పించి నిర్మాణానికి ఉపయోగించారు. మహారాష్ట్ర నుంచి శిల్ప కళాకారులను రప్పించారు. 1935లో పనులు పూర్తి చేయించారు. ఇక్కడకు మిషనరీగా వచ్చిన రెవ ఫాస్సూట్ సీఎస్ఐ చర్చిగా నామకరణం చేసి 1935 డిసెంబర్ 25న చర్చిని ప్రారంభించారు. అప్పటి నుంచి 1954 వరకు ఆంగ్లేయులు ఫాదర్లుగా విధులు నిర్వహించారు. వారి కోసం అందమైన బంగ్లా నిర్మించుకున్నారు.

## చర్చికి 62 ఏళ్లు



ముస్తాబైన చర్చి

**కౌటాల:** మండలంలోని విజయనగరం గ్రామంలో ఉన్న కతోలిక చర్చికి 62 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 1962లో ఈ చర్చిని నిర్మించారు. గ్రామంలో అన్నీ క్రైస్తవ కుటుంబాలే ఉండడం విశేషం. చర్చి చుట్టూ అందమైన గార్డెన్ ఏర్పాటు చేసి అందులో రకరకాల మొక్కలను పెంచారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదంతో నిండుకుంది. 34 ఏళ్ల క్రితం పాత భవనాన్ని తొలగించి అదే స్థలంలో భారీ మందిరం నిర్మించారు. నేడు చర్చిలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఫాదర్ సీజో పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### పులి దాడిలో లేగదూడ హతం!

**తాండూర్:** పులి దాడి చేసి లేగదూడను హతమార్చిందన్న వార్త మంగళవారం పలు ప్రసార మాధ్యమాల్లో రావడంతో స్థానికుల్లో భయాందోళన మొదలైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నీలాయపల్లెకు చెందిన యువకులు సాయి, శంకర్ రేపల్లెవాడ శివారులోని పంటచేలలో పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా నీలాయపల్లే ప్లాంటేషన్-మామిడి తోట మధ్యలో ఉన్న చిన్న ఒర్రె వద్ద రక్తపు మడుగులో పడిఉన్న లేగదూడను చూసి భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ అధికారులకు విషయం తెలియడంతో గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ విషయమై డిప్యూటీ అటవీ రేంజ్ అధికారి తిరుపతిని సంప్రదించగా ఈ ప్రాంతంలో పులి సంచారంలేదని కొట్టిపారేశారు.

### ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి



గంగాప్రసాద్(ఫైల్)

**భైంసారూరల్:** ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల మేరకు కుంటాల మండలంలోని ఓల గ్రామానికి చెందిన బొంతల గంగాప్రసాద్ (36) సోమవారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై భైంసాకు వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మాటేగాం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య గీతిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### యువకుడికి పోలీసుల కౌన్సెలింగ్

**తానూరు:** మండలంలోని హిప్నెల్లితండాకు చెందిన పవార్ వికాష్ మంగళవారం ఉదయం భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎస్సై రమేశ్‌కు సమాచారం అందించడంతో అతన్ని వెతికి పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడుతాయని, పిల్లలు అనాథలుగా మారుతారన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### 27న పాసింగ్ అవుట్ పరేడ్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఈనెల 27న నూతన కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఉంటుందని బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు తెలిపారు. 9 నెలలుగా బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న 550 మంది కానిస్టేబుళ్ల శిక్షణ ముగిసినందున పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరేడ్‌కు కలెక్టర్ కుమార్‌దీపక్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

# కల్తీ ఆహారంపై అధికారుల్లో కదలిక



గీతాభవన్ హోటల్ సిబ్బందికి నోటీసులు అందజేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు



హాజీ పాన్‌షాప్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో కాలం చెల్లిన పదార్థాలను సీజ్‌చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు

- గీతాభవన్ హోటల్ నిర్వాహకులకు నోటీసులు
- జిల్లా కేంద్రంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తనిఖీ

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలో కల్తీ ఆహార పదార్థాలపై మంగళవారం వచ్చిన వార్తలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు స్పందించారు. సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. గీతా భవన్‌లో కర్రీలో సోమవారం స్టీల్ స్క్రబ్బర్ వచ్చిన ఘటన నేపథ్యంలో హోటల్ యజమానికి నోటీసులు జారీ చేశారు. అనంతరం బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తనిఖీ చేశారు. స్థానిక లక్ష్మీ టాకీస్ చౌరస్తా వద్ద థియేటర్ సమీపంలో హాజీ పాన్‌షాప్ అండ్ ఫాస్ట్ ఫుడ్, బేకరీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను గుర్తించి సీజ్ చేశారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. వాసు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, బేకరీలలో తనిఖీలు చేశామన్నారు. ఆహార పదార్థాలు నాణ్యతతో వినియోగదారులకు అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పది రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి:** జాతీయస్థాయి 9వ సబ్ జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అంతకుముందు పది రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ మాట్లాడారు. క్రీడలపై యువత దృష్టి సారించాలని సూచించారు. ఆటలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతాయన్నారు. 1970లో తాను యువకుడిగా క్రికెట్ ఆడానని తెలిపారు. రంజీ ట్రోఫీ వరకు వెళ్లానని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధిగా క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. క్రీడాకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. సాఫ్ట్ బేస్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు, క్రీడాపోటీల నిర్వాహకుడు పి.రవికుమార్ మాట్లాడుతూ.. కార్మిక క్షేత్రం బెల్లంపల్లి క్రీడలకు ప్రసిద్ధిగాంచిన పట్టణమన్నారు. సింగరేణి కార్మికులు, యువకులు క్రీడల్లో నైపుణ్యం కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఆడిన అనుభవం ఉందన్నారు. బెల్లంపల్లిలో స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే వినోద్ కృషి చేయాలని కోరారు.

**పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు..**

నేషనల్ బేస్‌బాల్ పోటీలకు పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. మహారాష్ట్ర, హర్యానా, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చండీగర్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువేందర్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్, కోశాధికారి ఇమ్మానియేల్ దినకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు, జిల్లా త్రోబాల్ సెక్రెటరీ వై.బలరాం, తైక్వాండో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బి.బాబురావు, పీడీలు రాజ్‌మహ్మద్, శ్రావణ్, పద్మ, శిరీష, సీనియర్ క్రీడాకారులు ఐలయ్య, రాజం, నగేష్, యాదన్న, నరసయ్య పాల్గొన్నారు.

# అసంక్రమణ వ్యాధుల క్లినిక్ ప్రారంభం



అసంక్రమణ వ్యాధులకు చికిత్స అందిస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అసంక్రమణ వ్యాధులకు చికిత్స అందించే క్లినిక్‌ను వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పంపించిన కేసులను ఈ కేంద్రంలోని ఫిజీషియన్ ద్వారా పరీక్షలు చేయించి, తగిన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ క్లినిక్‌లో ఒక ఫిజీషియన్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ పరీక్షలు ఇక్కడ నిర్వహించి, అవసరమైన మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ లింగారెడ్డి, లక్ష్మణ్, బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం సరఫరాలో అవకతవకలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

**నస్పూర్:** పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్(మండల్ లెవల్ స్టాకిస్ట్)పాయింట్ నుంచి పలు చౌకధరల దుకాణాలకు సరఫరా చేసే పీడీఎస్ బియ్యంలో అవకతవకలు జరగకుండా చూడాలని జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుధమల్ల కృష్ణ, జనరల్ సెక్రటరీ బొమ్మ సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నస్పూర్, హాజీ పూర్, జైపూర్, మంచిర్యాల, మందమర్రి మండలాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం తక్కువగా వస్తున్నాయని తెలిపారు. కొన్ని బస్తాలలో నాసిరకం బియ్యం వస్తున్నాయన్నారు. ఈమేరకు పలువురు డీలర్లతో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శంకర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఒకే లారీలో రెండు మూడు షాపులకు బియ్యం సరఫరా చేస్తున్నారని, సరైన సమాచారం లేకుండా బియ్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. డీలర్ల వద్ద నుంచి ఈ పాస్ మిషన్‌లో వేలు ముద్రలు తీసుకున్న వెంటనే బియ్యం సరఫరా చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్, జైపూర్, మందమర్రి, మండలాల అధ్యక్షులు రవి, మహేందర్, శంకర్, ప్రసాద్, అనీల్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై ఆత్మహత్య

**ఇంద్రవెల్లి:** మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అంజీ గ్రామానికి చెందిన గోడ్‌మలే రాహుల్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. సోమవారం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం పంటచేలకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందుతాగి ఇంటికొచ్చాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

**ఉట్నూర్‌రూరల్:** జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షేక్ మోయిస్, షేక్ సాజిద్, సిండే రాజా సోమవారం ఉట్నూర్‌లోని బోయవాడకాలనీలో రమేశ్‌కు చెందిన ఇంట్లో చోరీకి యత్నించారు. సీసీపుటేజీ ఆధారంగా మంగళవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 2.1 తులాల బంగారం, 70 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 27న ఉమ్మడి జిల్లా సైక్లింగ్ క్రీడాకారుల ఎంపిక

**బెల్లంపల్లి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి సైకింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రెటరీ బి.బాబురావు తెలిపారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈపోటీలకు ఇంటర్ చదువుతూ 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాల బాలికలు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 7 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 984 9922445 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

**నస్పూర్:** సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సొంతింటి కల నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాలతో విధులకు గైర్హాజరైన కార్మికులను మెడికల్ చెకప్‌కు పంపించడం సరికాదన్నారు. ప్రభుత్వం నుంచి కంపెనీకి రావల్సిన రూ.33వేల కోట్ల పైచిలుకు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో గని పిట్ సెక్రెటరీ చిగురు లక్ష్మణ్, బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగల శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌రెడ్డి, సదానందం, సురేందర్, సురేష్, శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/మందమర్రిరూరల్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో అమిత్‌షా వ్యాఖ్యలపై మంగళవారం వేర్వేరుగా నిరసన తెలిపారు. మందమర్రి సింగరేణి హైస్కూల్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెల్లంపల్లిలోనూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మంచిర్యాలలోని తన నివాసంలోనూ కేంద్రమంత్రి తీరును ఖండించారు. అమిత్‌షా క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని రాహుల్‌గాంధీతో కలిసి పార్లమెంటులో ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంబేద్కర్‌తోపాటు, బడుగు బలహీనవర్గాలను కించపరిచేలా అమిత్‌షా మాట్లాడారన్నారు. పార్లమెంటు ఎన్నికల్ల తక్కువ సీట్లు వచ్చినా రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. దేశం మొత్తం తమ రాజ్యాంగమే ఉండాలని ముందుకు వెళ్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ నిజస్వరూపం బయటపడి ఉంటే, 240 సీట్లు కూడా వచ్చేవి కావన్నారు. కార్యక్రమాల్లో దళిత, బీసీ సంఘాల నాయకులు కుంబాల రాజేశ్, కాసర్ల యాదగిరి, సబ్బని రాజనర్సు, దుర్గం గోపాల్, ఎండీ ఈసా, సిరంగి శంకర్, ఎలిగేటి శ్రీనివాస్, ఎల్బురి శంకర్, పాట్ల సురేశ్, మాజీ సర్పంచ్ మంద అనిత, వెంకటస్వామి, రాంనాథ్, మనోహర్, కాంగ్రెస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు మహాసభలకు చెన్నూర్ కవులు



తెలుగు మహాసభలకు ఎంపికైన కవులు

**చెన్నూర్:** విజయవాడలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు చెన్నూర్‌కు చెందిన కవులు బొడ్డు మహేందర్, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లుకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ సాహిత్య గొంతుకను ప్రపంచ వేదికపై విన్పించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరగనున్న మహాసభల్లో పాల్గొని జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తామని తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలో ఏటీడీవో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

**కోటపల్లి:** కోటపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన ఘటనపై సోమవారం 'సాక్షి'లో 'డౌట్ అడిగినందుకు చితకబాదిన టీచర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు స్పందించారు. మంగళవారం కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏటీడీవో పురుషోత్తం సందర్శించి విద్యార్థులను అడిగి పాఠశాల పరిస్థితులు, ఉపాధ్యాయుల పనితీరు, మెనూపై ఆరా తీసినట్లు సమాచారం. ఇదే విషయంపై ఏటీడీవో పురుషోత్తంను సంప్రదించగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.